ఆడపిల్లల వివాహాలకు అండగా కళ్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్

- **39 మంది లబ్ధిదారులకు రూ.39.04 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**
- **అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం**
- **ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణ రావు**

శాయంపేట,అక్టోబర్ 01, డి డి 9వార్త

ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణ రావు అన్నారు. శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాల కింద అర్హత పొందిన 39 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.39,04,524 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం భారంగా మారకుండా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు.లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పులపాలు చేసినప్పటికీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలు,అర్హతలను పరిగణనలోకి తీసుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్‌తో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు,ఎల్ఓసీలను కూడా పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ప్రజా ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమలాంటి పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్,ఎంపీడీవో,మండల వ్యవసాయ అధికారి,ఇతర శాఖల అధికారులు,పరకాల మార్కెట్ వైస్ చైర్మన్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.





విద్యార్థిని చదువుకు వ్యాల్ల హరీష్‌రెడ్డి ఆర్థిక చేయూత

- **రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత**
- **నిరుపేదలకు అండగా నిలుస్తున్నారన్న పోలాడి శ్రీనివాసరావు**

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 01 (డీడీ9 వార్త):

పై చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో యూనియన్ జేఏసీ నాయకుడు ఎస్.కె. జబ్బర్ కుమార్తెకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్‌రెడ్డి ఆర్థిక చేయూత అందించారు. ఆటో సేవా సమితి అధ్యక్షుడు కడార్ల శ్రీధర్ విద్యార్థిని పరిస్థితిని హరీష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఆయన రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని గురువారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పోలాడి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఎస్.కె. జబ్బర్ కుటుంబ సభ్యులకు అందజేశారు.
ఈ సందర్భంగా పోలాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వ్యాల్ల హరీష్‌రెడ్డి నిరుపేదలకు అండగా నిలుస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో రామగుండం ప్రాంతానికి ఎమ్మెల్యేగా సేవలందిస్తూ నిరుపేదలు, యువతకు మరింత అండగా నిలవాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో చౌరస్తా2 ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎం.డి. అన్ను, ఆటో జేఏసీ ఇన్‌చార్జి మడిపెద్ది రమేష్, నారుమళ్ల రమేష్, బండి రాజు, మామిడి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీపై విమర్శలు మానుకోవాలి

- **టీబీజీకేఎస్‌కు ఏఐటీయూసీని ప్రశ్నించే నైతిక హక్కు లేదు: మడ్డి ఎల్లా గౌడ్**
- **కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నాం**

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 01 (డీడీ9 వార్త):



సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న ఏఐటీయూసీపై టీబీజీకేఎస్ విమర్శలు చేయడం సరికాదని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ అన్నారు.
టీబీజీకేఎస్ 11 ఏళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. ఏఐటీయూసీ పోరాటాలు, ఉద్యమాల ఫలితంగానే కార్మికులు అనేక హక్కులు సాధించుకున్నారని పేర్కొన్నారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ బాధ్యతలు చేపట్టిన అనంతరం రెండు కొత్త బ్లాకులు సాధించుకున్నామని, గతంలో ఎన్ని కొత్త బ్లాకులు తీసుకొచ్చారో టీబీజీకేఎస్ చెప్పాలని ప్రశ్నించారు.
కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంతో చర్చలు జరిపినట్లు తెలిపారు. 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చి, ఆగస్టు 27న 24 డిమాండ్లపై ఒప్పందం చేసుకున్నామని, త్వరలో సంబంధిత సర్కులర్లు వెలువడతాయని చెప్పారు.
గత ప్రభుత్వ హయాంలో సింగరేణికి సంబంధించిన బకాయిల విషయంలో రాజకీయ జోక్యం జరిగిందని మడ్డి ఎల్లా గౌడ్ ఆరోపించారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.


దాసాంజనేయ స్వామి ఆలయ స్లాబ్ పనులకు శ్రీకారం

- **48, 49వ డివిజన్ల కార్పొరేటర్ల చేతుల మీదుగా ప్రారంభం**
- **ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి: గుమ్మడి రవి**

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 01 (డీడీ9 వార్త):

పద్మావతి కాలనీ-కేసీఆర్ కాలనీల పరిధిలోని దాసాంజనేయ స్వామి హనుమాన్ ఆలయ స్లాబ్ నిర్మాణ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. 48వ డివిజన్ కార్పొరేటర్ రేణిగుంట్ల నిర్మల తిరుపతి, 49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు కొబ్బరికాయ కొట్టి స్లాబ్ పనులను ప్రారంభించారు.
ఈ సందర్భంగా గుమ్మడి రవి మాట్లాడుతూ.. దాసాంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పం ఎన్నో సంవత్సరాలుగా ఉన్నప్పటికీ పలు ఆటంకాలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పనులు ప్రారంభించలేకపోయామని తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో ప్రస్తుతం స్లాబ్ పనులు ప్రారంభించినట్లు చెప్పారు.
ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్జీఎం అధికారులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆలయ నిర్మాణానికి సహకరించేందుకు ముందుకు వచ్చే దాతలు విరాళాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.





పేద వర్గాల వైద్య ఖర్చులకు ఆర్థిక భరోసా..

- **CMRF చెక్కులు మరియు LOC లను అందజేసిన ఎమ్మెల్యే..**
- **నియోజకవర్గ ప్రజలకు ఆపద సమయంలో అండగా ఉంటానన్న పాయం.**

మణుగూరు. అక్టోబర్ 1 (డి డి 9వార్త)

భద్రాద్రి జిల్లా,కరకగూడెం మండలానికి చెందిన జాడి సమ్మయ్యకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కును పినపాక ఎమ్మెల్యే,తెలంగాణ రాష్ట్ర శాసన సభ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. మరో లబ్ధిదారు అయిన అశ్వాపురం మండలం, బుడుగు బజారుకు చెందిన రాంపూడి నాగమణికి వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల విలువైన ఎల్ ఓ సి (LOC) ని అందజేశారు.అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాగమణి కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం ఎంతో తోడ్పాటును అందించనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరికీ వైద్య సేవలు ఆగిపోకూడదు అనే ఉద్దేశంతో అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా చొరవ తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పాయం తెలిపారు.
ఈ సందర్భంగా వైద్య చికిత్సల కోసం ప్రభుత్వ సహాయం పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలియజేసారు.



సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి: కేసిరెడ్డిపల్లిలో విగ్రహావిష్కరణ

బచ్చన్నపేట:

మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటాన్ని పలువురు గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామంలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.
కార్యక్రమంలో మల్లపరం వెంకటేశ్వరరెడ్డి, మడిపల్లి నరేష్‌గౌడ్, బచ్చన్నపేట మండల అధ్యక్షుడు యాధండ్ల పరంధాములు గౌడ్, పెద్దగౌడ్ యాధండ్ల శ్రీను గౌడ్, యాధండ్ల తిరుపతి గౌడ్, నాలగొప్పుల బాలరాజు గౌడ్, ప్రశాంత్ గౌడ్, యాధండ్ల కైలాస్ గౌడ్, శంకు గౌడ్, శ్రీకాంత్ గౌడ్, వికాస్ గౌడ్, సాయి గౌడ్, చింటూ గౌడ్, శేఖర్ గౌడ్, అభి గౌడ్, గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



3వ వార్డులో చెత్త వాహనం ప్రారంభం

జనగామ అక్టోబర్1 (డిడి9వార్త)బ్యూరో

జనగామ పట్టణంలోని 3వ వార్డులో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు మున్సిపాలిటీ కేటాయించిన నూతన చెత్త సేకరణ వాహనాన్ని వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటింటి నుంచి చెత్తను వాహనం ద్వారా సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు.





ఎన్నారై దాతల ప్రోత్సాహం.. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

చర్ల, అక్టోబర్ 1 (డిడి 9 వార్త)

చర్ల మండల కేంద్రంలోని మీకోసం మేమున్నాం టీం ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు ఎన్నారై స్కాలర్షిప్ లను చర్లలోని శ్రీ వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల వేదికగా గురువారం చర్ల మండలం ఎంపీడీఓ, ఎంఈఓ చేతుల మీదుగా ఈ బృహత్కార్యానికి శ్రీకారం చుట్టారు. చర్ల మండలం లింగాపురం వాస్తవ్యులు ఎన్ఆర్ఐ పరుచూరి ప్రశాంత్ కుమారుడు పరుచూరి అర్జున్ స్పాన్సర్ చేస్తున్న ఈ స్కాలర్షిప్స్ ఇకపై ప్రతీ సంవత్సరం విద్యార్థులకు ఇవ్వనున్నారు. అమెరికాలో ఫ్లస్టు చదువుతున్న అర్జున్ తన సహ విద్యార్థుల సహకారంతో ఈ గొప్ప కార్యాన్ని ప్రతిపాదించడం ఎంతో సంతోషదాయకం. మనందరికీ సుపరిచితులైన పరుచూరి వెంకయ్య ముని మనవడు కావడం ఆనందదాయకం. ఈ సంవత్సరానికి చర్ల మండలం నుండి మొత్తం 11 మంది విద్యార్థినీ విద్యార్థులకు సుమారు 66 వేల రూపాయల స్కాలర్షిప్ ను అందజేశారు. రాబోయే కాలంలో ఈ ఫండ్ మరింతగా పెంచి, అత్యధికులకు లబ్ధి చేకూరేలా ఏర్పాటు చేయనున్నట్లు అర్జున్ పరుచూరి తెలిపారు. వీరు గతంలో కూడా మీకోసం మేమున్నాం టీం ఆధ్వర్యంలో సీపీర్ శిక్షణా తరగతులు, పాఠశాలలకు ఉచిత పుస్తకాలు, బ్యాగులు పంపిణి, వారాంతపు అన్నదానాలు వంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఎంపీడీఓ కన పర్తి ఈదయ్య మాట్లాడుతూ మారుమూల ఏజన్సీ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులను గుర్తించి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో గొప్ప విషయమని, వీరందరినీ ఓ వేదికపైకి తీసుకురావడానికి తోడ్పాటునిస్తున్న మీకోసం మేమున్నాం టీం సంస్థ సేవలు అమోఘమని కొనియాడారు. అనంతరం ఎంఈఓ పరిటాల వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి ఎంతో ఉపయోగకరమని, ఈ స్కాలర్షిప్ ప్రోగ్రాం నిర్విఘ్నంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైనేని పద్మజ, గౌరీ శంకర్, లిఖిత, గొట్టిపాటి శ్రీనివాసరావు, దొడ్డ ప్రభుదాస్, కవ్వాల రాము, దొడ్డి సూరిబాబు, అక్కినేని నెహ్రూ, ముమ్మనేని అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్

జనగామ అక్టోబర్ 1(డిడి 9వార్త)బ్యూరో

మహబూబ్‌నగర్: రక్తం అందక ఏ ఒక్క ప్రాణం పోకూడదనే లక్ష్యంతో సోనూసూద్ ఫౌండేషన్-మహబూబ్‌నగర్ సేవలు కొనసాగుతున్నాయని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు సోనూసూద్ శివ తెలిపారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో సోనూసూద్ చేసిన సేవల స్ఫూర్తితో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు పలువురికి రక్తాన్ని అందించి అత్యవసర సమయాల్లో సహాయపడినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కోరారు.








సీఆర్పీఎఫ్ శిబిరాల్లో 59 యూనిట్ల రక్తదానం

భద్రాచలం టౌన్, అక్టోబరు 1 (డీ డీ 9 వార్త)

నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా భద్రాచలం 141, ఎటపాక 212, కలివేరు 151 సీఆర్పీఎఫ్ బెటాలియన్ క్యాంపుల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి యువ వైద్యుడు డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొని జవాన్ల నుంచి మొత్తం 59 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కలివేరు క్యాంపులో 22, భద్రాచలంలో 21, ఎటపాకలో 16 యూనిట్ల రక్తం సేకరించారు. సేకరించిన రక్తాన్ని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు తరలించి అవసరమైన పేద రోగులకు వినియోగించనున్నట్లు డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. రక్తదానం చేసిన సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు

బండారు చందర్రావు ఉద్యమ ప్రస్థానంలో సత్యవతి పాత్ర మరువలేనిది

భద్రాచలం టౌన్, అక్టోబరు 1 (డీ డీ 9 వార్త)



బండారు చందర్రావు ఉద్యమ ప్రస్థానంలో ఆయన సతీమణి బండారు సత్యవతి పాత్ర మరువలేనిదని సీపీఎం సీనియర్ నాయకులు సోమయ్య, బత్తుల హైమావతి అన్నారు. గురువారం అనారోగ్యంతో ఉన్న సత్యవతిని వారు పరామర్శించి, నాటి ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎమర్జెన్సీ కాలంలో కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే ఉద్యమానికి అండగా నిలిచారని సోమయ్య పేర్కొన్నారు. చందర్రావు హత్య అనంతరం కూడా కుంగిపోకుండా తన ఇద్దరు కుమారులను ఉద్యమానికి అందించిన దిశాలి సత్యవతి అని కొనియాడారు. భద్రాచలం, చింతూరు, వీఆర్ పురం, కూనవరం ప్రాంతాల్లో మహిళా ఉద్యమాల నిర్మాణంలో ఆమె కీలక పాత్ర పోషించారని హైమావతి తెలిపారు. ఎనిమిది పదుల వయసులోనూ నాటి ఉద్యమ జ్ఞాపకాలను నేటితరానికి తెలియజేస్తున్నారని పేర్కొన్నారు.

నిబంధనలకు తూట్లు.. అక్రమ నిర్మాణానికి అడ్డూ అదుపూ లేదా..!

- రోడ్డు స్థలం వదలకుండా నిర్మాణం.. డ్రైనేజీపై పిల్లర్లు..!
- మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవంటూ ఆర్డీవోకు ఫిర్యాదు
- ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు ఏకు శంకర్ మాదిగ

పరకాల, అక్టోబర్ 01,డి డి 9వార్త

హన్మకొండ జిల్లా పరకాల పట్టణంలోని గొడ్ల అంగడి ముందు, ఇంటి నంబర్ 3277 వద్ద జరుగుతున్న గృహ నిర్మాణంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు ఆరోపిస్తూ, దీనిపై సమగ్ర విచారణ జరిపి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు ఏకు శంకర్ మాదిగ రీజనల్ డైరెక్టర్,టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారికి గురువారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా శంకర్ మాదిగ మాట్లాడుతూ సదరు భవన నిర్మాణానికి మంజూరైన అనుమతులు,ఆమోదిత నిర్మాణ ప్రణాళికకు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు.ముఖ్యంగా రోడ్డు ఎఫెక్టెడ్ ఏరియా కింద వదలాల్సిన స్థలాన్ని వదలకుండా నిర్మాణం చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

రోడ్డు స్థలంపైనే నిర్మాణమా..?

భవనం చుట్టూ నిబంధనల ప్రకారం వదలాల్సిన ఖాళీ స్థలం లేకుండా నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని శంకర్ మాదిగ పేర్కొన్నారు. భవనం ముందు భాగంలో రోడ్డు వైపు బాల్కనీని పొడిగించి నిర్మించినట్లు, డ్రైనేజీపై పిల్లర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ నిర్మాణాల వల్ల భవిష్యత్‌లో ప్రజల రాకపోకలకు, డ్రైనేజీ నిర్వహణకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు.

కౌన్సిలర్ అభ్యంతరాలు లెక్కలోకి రాలేదా..?

భవన నిర్మాణ వ్యవహారంలో సంబంధిత కౌన్సిలర్ అభ్యంతరాలను అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత కౌన్సిలర్ దళిత నాయకుడు కావడంతో అయన అభిప్రాయాలను పక్కన పెట్టి అనుమతులు ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.మున్సిపల్ చైర్మన్ చొరవతోనే నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు.కౌన్సిలర్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అనుమతుల ప్రక్రియ ఎలా ముందుకు సాగిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించారా లేదా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.అనుమతుల మంజూరులో నిబంధనలు పాటించారా...? లేక రాజకీయ ఒత్తిళ్లకు ప్రాధాన్యత ఇచ్చారా...? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజా స్థలం,రోడ్డు,డ్రైనేజీకి సంబంధించిన అంశాల్లోనూ అధికారులు పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉంది.కౌన్సిలర్ అభ్యంతరాలను పక్కన పెట్టి అనుమతులు ఇచ్చినట్లయితే అందుకు బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.ఈ ఆరోపణలపై మున్సిపల్ అధికారులు వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.సమగ్ర విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా.. స్పందన ఏదీ...?

ఈ నిర్మాణంపై ఇప్పటికే పరకాల మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని శంకర్ మాదిగ ఆరోపించారు.ప్రజా స్థలం, రోడ్డు,డ్రైనేజీకి సంబంధించిన అంశాల్లో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు.భవన నిర్మాణ అనుమతి, ఆమోదిత ప్లాన్,సెట్‌బ్యాక్‌లు,రోడ్డు ఎఫెక్టెడ్ ఏరియా,బాల్కనీ నిర్మాణం, డ్రైనేజీపై ఏర్పాటు చేసిన పిల్లర్లు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగినట్లు విచారణలో తేలితే సంబంధిత వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని,ప్రజా స్థలాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఏకు శంకర్ మాదిగ కోరారు.





లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..

- పేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం -- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

మణుగూరు. అక్టోబర్ 1 (డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలంలోని 14 గ్రామ పంచాయతీలు మరియు మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను, అలాగే 33 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులను పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర శాసనసభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందని, పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.
పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అదేవిధంగా ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ పథకం ద్వారా 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం వివాహ సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.పినపాక నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రామారావు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, సివిల్ సప్లై అధికారి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది

- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలి
- శాయంపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బీ జే పి ధర్నా కార్యక్రమం

శాయంపేట,అక్టోబర్ 01, డి డి 9వార్త

రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శాయంపేట మండల అధ్యక్షులు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో శాయంపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాయరాకుల మొగిలి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాయరాకుల మొగిలి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో విఫలమైందని విమర్శించారు.విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు సాగునీరు అందుబాటులో ఉండాలంటే నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో అవసరమని, ప్రభుత్వం వెంటనే వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ,రైతుల ప్రయోజనాల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో పాటు విద్యుత్ కోతలకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ ఉప్పు రాజు,జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ కానుగుల నాగరాజు,ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం రమేష్, అధికార ప్రతినిధి మోత్కూరు సత్యనారాయణ, కార్యదర్శి కడారి చంద్రమౌళి,సీనియర్ నాయకులు బూర ఈశ్వరయ్య,బాసాని విద్యాసాగర్,వనం దేవరాజు, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, ఉపాధ్యక్షులు రాజశేఖర్,కార్యదర్శి మేకల సుమన్,బూత్ అధ్యక్షులు కన్నీబోయిన రమేష్,కొంగరి కోడెపాక సంజీవరావు సుధాకర్,పున్నం సాంబయ్య,బత్తుల రవి, ఉప్పునూతుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు



జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

- 59 మంది స్వచ్ఛందంగా రక్తదానం

భద్రాచలం టౌన్, అక్టోబర్ 1 (డీ డీ 9 వార్త)

జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా ఇంజిరాంలోని 219వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆపరేషన్ కొంటా అధికారి, డీఐజీ ఓపీఎస్ కుంట రాజేష్ పాండే ప్రారంభించారు. ఈ శిబిరంలో మొత్తం 59 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఐజీ రాజేష్ పాండే మాట్లాడుతూ రక్తదానం గొప్ప మానవతా సేవ అని అన్నారు. ప్రమాద బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, క్యాన్సర్ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి అత్యవసర సమయాల్లో రక్తం ఎంతో అవసరమని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు, వైస్ చైర్మన్ చల్లగుళ్ల నాగేశ్వరరావు హాజరై రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ప్రజలకు నిరంతరం సేవలందిస్తోందని తెలిపారు. ఆధునిక పరికరాలతో సురక్షితమైన రక్తాన్ని సేకరించి అవసరమైన వారికి అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సీఆర్పీఎఫ్ అధికారులకు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.ఎస్.ఆర్. చంద్ర ప్రసాద్, జిల్లా కోశాధికారి టి.వి. బాలయోగి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.బి.జి. తిలక్, ఎం.బి. నర్సారెడ్డి, పల్లంటి దేశప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆటపాటలతో సందడిగా మహిళల బొడ్డెమ్మ సంబరాలు..!

- **తొమ్మిది రోజుల పాటు గౌరమ్మకు ప్రత్యేక పూజలు**
- **తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని కాపాడుకుంటున్న మహిళలు**
- **కొప్పుల గ్రామంలో కోలాటాలు, పాటలతో పండుగ వాతావరణం**

శాయంపేట,అక్టోబర్ 01, డి డి 9వార్త

హనుమకొండ జిల్లా శాయంపేట మండల వ్యాప్తంగా ఆడపడుచులకు ఆరాధ్యదైవంగా భావించే బొడ్డెమ్మ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.మండలంలోని కొప్పుల గ్రామంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బొడ్డెమ్మను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బొడ్డెమ్మ చుట్టూ చేరిన మహిళలు ఆటపాటలు,కోలాటాలతో సందడి చేయడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బొడ్డెమ్మను అందంగా అలంకరించి,పసుపుతో గౌరమ్మను తయారు చేసి ప్రత్యేకంగా ప్రతిష్ఠించి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.పెద్దలు, యువతులు,చిన్నారులు సైతం వేడుకల్లో పాల్గొనడంతో కొప్పుల గ్రామంలో ఎటుచూసినా పండుగ సందడే కనిపించింది. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ,కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.

పుట్టమన్నుతో బొడ్డెమ్మ.. పసుపుతో గౌరమ్మ

బొడ్డెమ్మ ప్రత్యేకత గురించి మహిళలు మాట్లాడుతూ...పుట్టమన్నును సంప్రదాయబద్ధంగా తీసుకొచ్చి బొడ్డెమ్మగా పేరుస్తామని తెలిపారు. అనంతరం పసుపుతో గౌరమ్మను తయారు చేసి బొడ్డెమ్మపై ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తామని వివరించారు.ఐదుగురు ముత్తైదువుల ఆధ్వర్యంలో పుట్టమన్నును తీసుకురావడం నుంచి బొడ్డెమ్మను ఏర్పాటు చేయడం వరకు ప్రత్యేకమైన ఆచారాలను పాటిస్తామని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు మహిళలు ప్రతిరోజూ బొడ్డెమ్మ చుట్టూ చేరి పాటలు పాడుతూ,ఆటలు ఆడుతూ గౌరమ్మను కొలుస్తారని చెప్పారు.ఈ వేడుకలు కేవలం పండుగకే పరిమితం కాకుండా మహిళల మధ్య ఆత్మీయతను,ఐక్యతను పెంచే సంప్రదాయంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

కన్నెపిల్లల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు.....

బొడ్డెమ్మ పండుగలో తొమ్మిదో రోజు ప్రత్యేకత ఉంటుందని మహిళలు తెలిపారు.తొమ్మిదో రోజు కన్నెపిల్లలను ప్రత్యేకంగా వేడుకల్లోకి తీసుకువచ్చి వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో సాగాలని,మంచి భర్తలు లభించాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహిస్తామని చెప్పారు. ముత్తైదువులు సౌభాగ్యంతో, ఆయురారోగ్యాలతో కలకాలం కొనసాగాలని గౌరమ్మను ప్రార్థిస్తామని వివరించారు.తొమ్మిది రోజుల పూజలు పూర్తయిన అనంతరం పుట్టమట్టితో తయారు చేసిన బొడ్డెమ్మతో పాటు గౌరమ్మను నీటిలో నిమజ్జనం చేసి సాగనంపడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ ఆచారం తమ పెద్దల నుంచి తమకు సంక్రమించిందని,అదే సంప్రదాయాన్ని నేటి తరానికి పరిచయం చేస్తున్నామని పేర్కొన్నారు.

సంస్కృతికి ప్రతిరూపం.. బొడ్డెమ్మ పండుగ....

బొడ్డెమ్మ వేడుకలు తెలంగాణ గ్రామీణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయని మహిళలు తెలిపారు. ఆధునిక కాలంలో ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ తరతరాలుగా వస్తున్న పండుగలు,ఆచారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా చిన్నారులు,యువతులు మన సంప్రదాయాలను తెలుసుకునేలా బొడ్డెమ్మ పండుగ ప్రత్యేకతను వారికి వివరిస్తున్నామని తెలిపారు.పాటలు, కోలాటాలు,పూజలతో తొమ్మిది రోజుల పాటు బొడ్డెమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకుంటామని తెలిపారు. పల్లె సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఇలాంటి సంప్రదాయాలు కనుమరుగుకాకుండా భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని మహిళలు తెలిపారు.కొప్పుల గ్రామంలో మహిళల ఆటపాటలు,కోలాటాలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బొడ్డెమ్మ వేడుకలతో గ్రామంలో మరింత పండుగ సందడి నెలకొననుంది.ఈ వేడుకల్లో యజ్ఞం లక్ష్మి,అదిదెల దేవేంద్ర,దోపతి అరుణ, అదిదెల జ్యోతి,మారేపల్లి సరిత, సామల విజయ,అదిదెల విజయ, కొమురాజు నీల,నవ్వుల దుర్గలక్ష్మి, వంగరి అరుణ,గుజ్జుల సునీత, అదిదెల లావణ్య, అదిదెల నిఖిత, దోపతి శ్వేత, మారేపల్లి లక్ష్మి, కొమురాజు పూల తదితర మహిళలు పాల్గొన్నారు.





పోలీస్, ఎస్ ఐ పరీక్షలకు గిరిజన అభ్యర్థులకు ఉచిత కోచింగ్

భద్రాచలం టౌన్, అక్టోబరు 1 (డీ డీ 9 వార్త)

పోలీస్ శాఖ నిర్వహించే సబ్ ఇన్ స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులకు ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన 100 మంది అభ్యర్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు గురువారం వెల్లడించారు. శిక్షణలో ఉచిత కోచింగ్ తో పాటు స్టడీ మెటీరియల్, పరీక్ష విధానంపై అవగాహన, ఫిజికల్ ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా జిల్లాల్లో నివాసం ఉండి 2026 పోలీస్ నియామకానికి దరఖాస్తు చేసుకున్న గిరిజన అభ్యర్థులు అర్హులని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు.స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి మెరిట్ తో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 1 నుంచి 7వ తేదీ వరకు ఐటీడీఏ భద్రాచలంలోని




ఉపసంచాలకులు (ట్రైబల్ వెల్ఫేర్) కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుతో పాటు కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఎస్ ఎస్ సీ, ఇంటర్ , డిగ్రీ మెమోలు, 2026 పోలీస్ నియామక నోటిఫికేషన్ కు దరఖాస్తు చేసుకున్న రసీదు కాపీని జత చేయాలి. అక్టోబర్ 10న స్క్రీనింగ్ టెస్ట్, 12న ఫలితాలు, సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. అక్టోబర్ 15 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పీవో తెలిపారు. ఇతర వివరాలకు పీఈటీసీ ప్రిన్సిపాల్ డా. ఎం.వీర నాయక్ ను 8978477345 నంబర్ లో సంప్రదించాలని సూచించారు.

ప్రమాద మృతుడి కుటుంబానికి బీమా చెక్కు

జనగామ అక్టోబర్ 1(డిడి 9వార్త)బ్యూరో

జనగామలో ఆటో ప్రమాదంలో మృతిచెందిన గాయత్రి కోపరేటివ్ బ్యాంకు ఖాతాదారుడు వంగాల నాగరాజు కుటుంబానికి రూ.లక్ష బీమా చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ అందజేశారు. బ్యాంకు ప్రమాద బీమా పథకంలో భాగంగా నాగరాజు తల్లిదండ్రులకు ఈ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ పోలు ప్రవీణ్‌కుమార్, మిద్దేపాక స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.



కోలం ఆశ్రమ పాఠశాలలో స్వచ్ఛత అభియాన్ సంకల్ప కార్యక్రమం

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్)

స్వచ్ఛతే సేవ అనే సంకల్పంతో కోలం ఆశ్రమ పాఠశాలలో స్వచ్ఛత అభియాన్ సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ ఆదిలాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎం పి నగేష్ మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను తమ నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, గ్రామాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్వచ్ఛ భారత్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

స్వచ్ఛత ఒక్కరి బాధ్యత కాదు ప్రతి ఒక్కరి బాధ్యత. మన ఇల్లు మాత్రమే కాదు మన గ్రామం, మన పాఠశాల, మన పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే నిజమైన స్వచ్ఛ భారత్ సాకారం అవుతుంది. స్వచ్ఛతను అలవాటుగా మార్చుకుం ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన భారతదేశాన్ని నిర్మిద్దాం. స్వచ్ఛ భారత్ ఆరోగ్య భారత్ శక్తివంతమైన భారత్ ఏర్పడుతుంది అని అన్నారు కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మారుమూల గ్రామాల్లో ఆరోగ్య భరోసా.. కాఫెడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం!

- **90 కుటుంబాలకు మెడికల్ కిట్ల పంపిణీ – ఆరోగ్యంపై అవగాహన కల్పించిన వైద్యులు..**

అక్టోబర్ 01 .డిడి9 వార్త వెంకటాపురం.

మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామచంద్రాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాఫెడ్ సంస్థ డైరెక్టర్ లూర్థు రాజు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు 90 కుటుంబాలకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎదిర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని తెలిపారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. మెడికల్ కిట్లలోని మాత్రలు, వాటి వినియోగం గురించి ప్రజలకు వివరించి, వైద్యుల సూచనల మేరకే మందులు వాడాలని అవగాహన కల్పించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సమాచారం అందించడం, అనారోగ్య సమస్యలపై ముందస్తు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఇటువంటి శిబిరాలు దోహదపడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హెచ్ ఈఓ కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ సుశీల, ఉపసర్పంచ్ శంకర్, ఆశా కార్యకర్తలు, కాఫెడ్ సంస్థ వెంకటాపురం మండల కోఆర్డినేటర్ జి. హనుమంత్, వాజేడు మండల కోఆర్డినేటర్ జి. కామేష్, యానిమేటర్లు ఉష, ఇందిర, పద్మ, ప్రశాంత్, నరేశ్, సుజల తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య శిబిరం ద్వారా సేవలు పొందారు.



కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ కమిటీ ఏర్పాటు..

అక్టోబర్01.డిడి9 వార్త వెంకటాపురం.

ములుగు జిల్లా వెంకటాపురం మండలం వెంగళరావుపేట గ్రామంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిట్యాల సాగర్ ఆధ్వర్యంలో 26 మందితో కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు.

గ్రామ అధ్యక్షుడిగా చంద్రగిరి సాగర్, ఉపాధ్యక్షుడిగా శెట్టిపల్లి రవిబాబు, కార్యదర్శిగా శెట్టిపల్లి కోటి, ప్రధాన మహిళా కార్యదర్శిగా వేల్పుల మానస, కార్యదర్శిగా అడ్డూరి సహజను నియమించారు.

ఈ సందర్భంగా చిట్యాల సాగర్ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ సెల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నష్టపోయిన సాయా పంటను పరిశీలన

- **రైతులకు అండగా ఉంటాం**
- **రైతులకు న్యాయం జరగకపోతే కలెక్టరేట్ ముందు ధర్నా**
- **మాళవిక కంపెనీపై కేసు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి**
- **ఎకరానికి రూ. 50 వేల నష్టపరిహారం చెల్లించాలి**

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (డిడి9 వార్త న్యూస్)

తలమడుగు మండలంలోని రుయ్యడి గ్రామంలో రైతు చిన్న రాజారెడ్డి విగర్ కంపెనీ మాళ్వీక రకం సొయా సాగు చేసి పంట దెబ్బతిన్న నేపథ్యంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పొలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మాళ్వీక రకం సాగుతో జరిగిన నష్టంపై రైతులతో ఎమ్మెల్యే మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి కష్టకాలంలో రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పంట నష్టానికి సంబంధించిన వివరాల ఆధారంగా జిల్లా కలెక్టర్ ఎస్సీలు జోక్యం చేసుకొని మాళవిక కంపెనీపై కేసు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీ నుంచి ఎకరానికి రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. తక్షణమే కంపెనీ వారిని జిల్లా కలెక్టర్, ఎస్సీ సమావేశం నిర్వహించి నష్టపోయిన రైతులకు అండగా ఉండలాని కోరారు. రైతులకు న్యాయం జరగపోతే, ఎలాంటి హామీ రాకపోతే కలక్టరేట్ ముందు భారీ ఎత్తున రైతులతో ధర్నాకి దిగుతానని హెచ్చరించారు. రైతు కష్టం వృథా కాకుండా చూడటమే మా బాధ్యత. పంట నష్టపోయిన ప్రతి రైతుకు అండగా నిలిచి కంపెనీ ద్వారా మొత్తం సహాయం అందేలా కృషి చేస్తా అని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.







ఆసియా క్రీడల్లో పాక్ చరిత్ర.. క్రికెట్‌లో తొలిసారి గోల్డ్ మెడల్ రేసులోకి!

డిడి9 వార్త :

ఆసియా క్రీడల్లో పాకిస్థాన్ పురుషుల క్రికెట్ జట్టు ఫైనల్‌కు చేరింది. వర్షం కారణంగా 13 ఓవర్లకు కుదించిన సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై 6 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 13 ఓవర్లలో 7 వికెట్లకు 111 పరుగులు చేసింది. పాకిస్థాన్ 11.3 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.భారీ వర్షాల కారణంగా మైదానం చిత్తడిగా మారడంతో టాస్, మ్యాచ్ ప్రారంభం ఆలస్యమైంది. దీంతో ఇరు జట్లకు 13 ఓవర్ల చొప్పున కేటాయించారు. పిచ్‌పై పగుళ్లు ఉండటంతో స్పిన్నర్లకు మంచి సహకారం లభించింది. బంగ్లాదేశ్ ఆరంభంలోనే వరుసగా వికెట్లు కోల్పోయింది. తంజీద్ హసన్ 7, కెప్టెన్ లిటన్ దాస్ 2, పర్వేజ్ హొస్సేన్ ఎమోన్ 1 పరుగుకే పెవిలియన్ చేరారు. సైఫ్ హసన్ 19 పరుగులు చేశాడు. 45 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో తౌహిద్ హృదోయ్ జట్టును ఆదుకున్నాడు. 25 బంతుల్లో 42 పరుగులు చేశాడు.ఇందులో 4 సిక్సర్లు, 2 ఫోర్లు ఉన్నాయి. దీంతో బంగ్లాదేశ్ 111 పరుగులు చేయగలిగింది. పాకిస్థాన్ బౌలర్లలో సుఫ్యాన్ మొకీమ్ 3, అరాఫత్ మిన్హాస్ 2 వికెట్లు తీశారు.



లక్ష్య ఛేదనలో పాకిస్థాన్‌కు కూడా ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. సాహిబ్‌జాదా ఫర్హాన్‌ను మహేదీ హసన్ రెండో ఓవర్లోనే ఔట్ చేశాడు. అయితే మాజ్ సదాఖత్ 15, ఉస్మాన్ ఖాన్ 14, సైమ్ అయూబ్ 21 పరుగులతో స్కోరును ముందుకు నడిపారు. చివర్లో అబ్దుల్ సమద్ 15 బంతుల్లో 30, హసన్ నవాజ్ 22 బంతుల్లో 27 పరుగులతో అజేయంగా నిలిచారు. 12వ ఓవర్లో నవాజ్ ఫోర్‌తో పాకిస్థాన్ విజయాన్ని ఖరారు చేశాడు.

ఇది ఆసియా క్రీడల్లో పాకిస్థాన్ పురుషుల క్రికెట్ జట్టు ఆడనున్న తొలి ఫైనల్. 2010లో కాంస్య పతకం సాధించిన పాక్.. ఇప్పుడు స్వర్ణం కోసం బరిలోకి దిగనుంది.

రాజీవ్ యువ వికాసం ఎప్పటి నుంచి యువతను ఇంకా ఎన్నాళ్లు ఎదురుచూడనిస్తారు

- **సాబ్లే సంతోష్ సింగ్**


ఆదిలాబాద్ జిల్లా బ్యూరో: (డిడి9 వార్త న్యూస్)



నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని పూర్తి స్థాయిలో ఎప్పటి నుంచి, ఎన్ని విడతలుగా అమలు చేస్తారో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు సాబ్లే సంతోష్ సింగ్ డిమాండ్ చేశారు పథకం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువత తమ భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రకటనలకే పరిమితం కాకుండా నిధుల విడుదల లబ్ధిదారుల ఎంపిక యూనిట్ల మంజూరు ఆర్థిక సహాయం అందించే ప్రక్రియపై స్పష్టమైన వివరాలు వెల్లడించాలని ఆయన కోరారు. యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. పథకం ప్రారంభిస్తామని ప్రకటించారు. మరి లబ్ధిదారుల చేతికి ఆర్థిక సహాయం ఎప్పుడు వస్తుంది ప్రతి జిల్లాలో ఎంపిక ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుంది గ్రామీణ ప్రాంతాల యువతకు ప్రయోజనం ఎప్పుడు అందుతుంది అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇటీవల ప్రభుత్వం నవంబర్ 19, 2026 నుంచి తొలి దశలో రూ.1 లక్ష వరకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు వార్తలు వెలువడ్డాయి.అయితే తొలి దశలో ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారు, జిల్లాల వారీగా ఎంతమందికి ప్రయోజనం అందుతుంది మిగిలిన దరఖాస్తుదారులకు ఎప్పుడు అవకాశం కల్పిస్తారు అనే అంశాలపై ప్రభుత్వం పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. యువతకు కావాల్సింది హామీలు కాదు. చేతిలో ఆర్థిక సహాయం జీవితంలో ఉపాధి స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న యువతకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీ, యూనిట్ మంజూరు వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలి. పథకం అమలులో ఎలాంటి జాప్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకంపై జిల్లా వారీగా స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని, దరఖాస్తుదారుల ఎంపిక ఎప్పుడు పూర్తవుతుందో, నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుతో ఆటలు వద్దు. ప్రకటనలకు పరిమితం కాకుండా రాజీవ్ యువ వికాసాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసి, అర్హులైన యువతకు వెంటనే ఆర్థిక సహాయం అందించాలి అని సాబ్లే సంతోష్ సింగ్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 01(డిడీ9 వార్త):



నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఇలా త్రిపాఠి గురువారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండు నెలల పాటు ప్రసూతి సెలవులో ఉన్న ఆమె, సెలవు కాలం ముగియడంతో మళ్లీ జిల్లా పాలనాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ రెండు నెలల కాలంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా నిజామాబాద్ ఇంచార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తిరిగి బాధ్యతలు చేపట్టిన ఇలా త్రిపాఠికి జిల్లా అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి కేశవపూర్ సంస్థ సభ్యుడు స్వామి

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డిడి 9 వార్త)అక్టోబర్ 1

తలమడుగు మండలం ఝరి గ్రామంలో. W W F కేశవపూర్ సంస్థ వారి ఆధ్వర్యంలో. రైతులకు. వ్యవసాయ పనులపై అవగాహన కల్పించారు.

సంస్థ సభ్యుడు. కడదారపు స్వామి మాట్లాడుతూ. అత్యంత విషపూరితమైన రసాయన మందులు వాడడం వలన. రైతుకు మేలు చేసే మిత్ర పురుగులు నశిస్తున్నాయి.

కీడు చేసే పురుగులు. వాటి బలాన్ని పెంచుకొని. తిరిగి యధాస్థితికి చేరి పంటను నాశనం చేస్తున్నాయి అని అన్నారు. మిత్ర పురుగులు నశించకుండా ఉండాలంటే రసాయన మందులు వాడకుండా సేంద్రియ ఎరువులు వాడడం వలన రైతులకు పెట్టుబడి భారం తగ్గి. మరియు అధిక దిగుబడులు వస్తాయన్నారు. రెండు రకాల పురుగు మందులు ఒకేసారి కలిపి వాడకూడదు అని తెలియజేశారు. పురుగుల మందు పిచికారి చేసే సమయంలో. తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల. రైతులకు ఎటువంటి హాని కలగదని తెలియజేశారు. అలాగే మహిళా రైతులకు పత్తి తీసే సమయంలో. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ. వారికి వ్యవసాయ పనుల్లో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని. గ్రామంలో ప్రధాన వీధుల గుండా సమాన పనికి సమాన వేతనం. ఇవ్వాలి అంటూనినాదాలు చేస్తూ మహిళా రైతులతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో. సంస్థ సభ్యులు స్వామి. అంకిత. మహిళా రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉచిత సౌర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోండి

- **- నిజామాబాద్‌లో 'సేవా సేతు ప్రచారం' ప్రారంభం**
- **- ₹2 లక్షల వరకు సులభంగా బ్యాంకు అప్పులు: ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ బిజయ కుమార్ సాహూ**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 01(డిడీ9 వార్త):

పునరుత్పాదక ఇంధన వాడకాన్ని పెంచడమే లక్ష్యంగా 'పీఎం సూర్య ఘర్' పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు 'సేవా సేతు ప్రచారం' చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ, తెలంగాణ పునరుత్పాదక ఇంధనాభివృద్ధి సంస్థ, బ్యాంకింగ్ రంగాల ఉమ్మడి ఆధ్వర్యంలో, లీడ్ బ్యాంక్ మేనేజర్ కొలుగూరి రాజు పర్యవేక్షణలో గురువారం నిజామాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ అవగాహన సదస్సులు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ నిజామాబాద్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ... ఇంటి అవసరాల కోసం మేడలపై సౌర విద్యుత్ అమరికలను ఏర్పాటు చేసుకుని, సౌర శక్తి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. పునరుత్పాదక ఇంధనాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ రవీందర్ మాట్లాడుతూ... పీఎం సూర్య ఘర్ పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న సాయం వివరాలను వెల్లడించారు. అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ పథకం కింద బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణ సదుపాయాలపై ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ బిజయ కుమార్ సాహూ వివరాలు అందించారు. 3 కిలోవాట్ల వరకు సామర్థ్యం గల సౌర విద్యుత్ అమరికల ఏర్పాటుకు ఎటువంటి ఆదాయ ధ్రువీకరణ పత్రం లేకపోయినా సులభంగా ₹2 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణానికి మేలు చేసే ఈ సౌర విద్యుత్‌తో భవిష్యత్తులో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ రవికిరణ్, విద్యుత్ శాఖ అధికారులు ఎం.డి. ముక్తార్, డిచ్‌పల్లి అధికారి హరిచంద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వ్యాపారులు, అధికారులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు అటవీశాఖ భారీ బైక్ ర్యాలీ..

- **వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన..**
- **"అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు" నినాదంతో చైతన్య కార్యక్రమం..**

అక్టోబర్ 01 డిడి9 వార్త వెంకటాపురం.

అడవులను కాపాడుకుందాం.. వన్యప్రాణులను సంరక్షిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ములుగు జిల్లా వెంకటాపురం ఫారెస్ట్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణ, అడవుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ ర్యాలీని ఫారెస్ట్ సబ్ డివిజనల్ అధికారి జి. ధ్వాలియా ప్రారంభించారు. అనంతరం ర్యాలీ చిరుతపల్లి, పర్కికగూడెం, రామవరం తదితర గ్రామాల మీదుగా కొనసాగింది.

ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు గ్రామస్తులకు అడవుల ప్రాముఖ్యత, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, అటవీ చట్టాలపై అవగాహన కల్పించారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల విలువైన వృక్ష సంపద నాశనం కావడమే కాకుండా వన్యప్రాణుల ఆవాసాలు దెబ్బతిని పర్యావరణ సమతుల్యతకు తీవ్ర విఘాతం కలుగుతుందని వివరించారు. "అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు" అనే నినాదంతో అడవులను అగ్నిప్రమాదాల నుంచి కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు.

అక్టోబర్ 1 నుంచి 7వ తేదీ వరకు అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని ఫారెస్ట్ సబ్ డివిజనల్ అధికారి జి. ధ్వాలియా తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, అడవులకు నిప్పు పెట్టకుండా అప్రమత్తంగా ఉండాలని, వన్యప్రాణులకు హాని కలిగించకుండా వాటి సంరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించి అటవీ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో మరింత చైతన్యం కల్పిస్తామని పేర్కొన్నారు.

అడవులు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద అని, వాటిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు స్పష్టం చేశారు. అటవీ సంపదను, వన్యప్రాణులను సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. అటవీశాఖ చేపడుతున్న పరిరక్షణ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ముక్తార్ హుస్సేన్, దూలాపురం, వాజేడు ఫారెస్ట్ రేంజ్‌ల ఇన్‌చార్జి అధికారి పి. నరేందర్, సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.









మేడారం పనులంటే మాయాజాలమేనా...?

- **ఆర్‌డబ్ల్యూఎస్ పనుల్లో అవినీతి ఆరోపణలు..**
- **చేతిపంపులు, బోర్లలో 'చేతివాటం'!**
- **భూమిలో కలిసిన పనులు.. సైడ్ కాలువల్లో మురిగిన నిధులు..**
- **రికార్డుల్లో మాత్రం పూర్తయినట్టేనా...?**

ఏటూరునాగారం క్రైం, డి డి 9 వార్త, అక్టోబర్ 01:

ములుగు జిల్లా మేడారం మహాజాతర.. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక.జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు,పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. అయితే జాతర పనుల్లోనే అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన చేతిపంపులు, బోర్లు ఎన్ని...? వాస్తవంగా ఎన్ని పనిచేస్తున్నాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కొన్నిప్రాంతాల్లో చేతిపంపులు ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో చూపించి.. క్షేత్రస్థాయిలో మాత్రం వాటి జాడ కనిపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల రోడ్డు నిర్మాణాల సమయంలో ఉన్న చేతిపంపులను రోడ్డు కిందికి తొక్కేసినట్లుగా కనిపిస్తున్నా.. అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇంకా కొన్ని చోట్ల పాత చేతిపంపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసినా..క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూమిలో పనులు.. రికార్డుల్లో మరో లెక్క.. బిల్లుల్లో ఇంకో లెక్క అన్న చర్చ స్థానికంగా జోరందుకుంది.

సైడ్‌కాలువల్లోకి జారిన పనుల నాణ్యత...?

జాతర పనుల్లో భాగంగా నిర్మించిన సైడ్‌కాలువలు,మరుగుదొడ్లు, తాగునీటి వసతులపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొన్ని పనులు పూర్తయ్యాయా..? లేక కాగితాలపైనే పూర్తయ్యాయా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పనుల నాణ్యత,వినియోగించిన సామగ్రి, నిర్మాణాల సంఖ్య,చెల్లించిన బిల్లులపై సమగ్రంగా పరిశీలన జరిపితే అసలు వాస్తవాలు బయటపడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

కాంట్రాక్టర్ల హవా.. అధికారుల చేతివాటమా....?

జాతర పనుల్లో కాంట్రాక్టర్ల హవా కొనసాగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.పనుల పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారా..? చేసినట్లయితే భూమిలో కలిసిపోయిన చేతిపంపులు, కనిపించని బోర్లు,అనుమానాస్పద నిర్మాణాలు వారి కంటికి ఎందుకు కనిపించలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేసిన ఓ డీఈ స్థాయి అధికారి, మరో మహిళా డీఈ,ఒక ఏఈ పర్యవేక్షణలో పలు పనులు జరిగినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.మరుగుదొడ్లు, చేతిపంపులు,బోర్ల నిర్మాణాల్లో నిధుల దుర్వినియోగం జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

రికార్డులు బయటపెడితే అసలు లెక్క తేలేనా....?

మేడారం జాతర పనుల్లో ఎన్ని చేతిపంపులకు నిధులు మంజూరయ్యాయి...? ఎన్ని బోర్లు వేశారు? ఎన్ని మరుగుదొడ్లు నిర్మించారు...? వాటి కోసం ఎంత మొత్తం ఖర్చు చేశారు...? ప్రస్తుతం వాటిలో ఎన్ని వినియోగంలో ఉన్నాయి...? అనే వివరాలను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.రికార్డుల్లో ఉన్న పనులు.. క్షేత్రస్థాయిలో లేని వసతులు ఉంటే ఆ నిధులు ఎటు వెళ్లాయన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిందే.జాతర పనుల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, రికార్డులు-క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మేడారం పేరుతో వచ్చిన నిధులు భక్తుల సౌకర్యాలకే ఖర్చయ్యాయా..? లేక మధ్యలోనే మాయమయ్యాయా..? అన్న అనుమానాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉంది.






కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- **కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన**
- **115 మందికి ఉచితంగా కంటి పరీక్షలు**
- **లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం: గ్రామ సర్పంచ్ బెజ్జరపు రాకేష్**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 01(డిడీ9 వార్త):

కమ్మర్‌పల్లి మండలంలోని కొనసముందర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామీణ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ బెజ్జరపు రాకేష్ సమక్షంలో సోమవారం ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు లయన్ డాక్టర్ అజయ్ ఆధ్వర్యంలో మొత్తం 115 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 29 మంది మోతిబిందు సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించి, శస్త్రచికిత్స అవసరమని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ బెజ్జరపు రాకేష్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధుల కృషిని అభినందించారు. ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి అధ్యక్షుడు తెడ్డు రమేష్ మాట్లాడుతూ... మోతిబిందు ఆపరేషన్ అవసరమైన 29 మందిని ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించి, ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత వారిని తిరిగి సురక్షితంగా గ్రామానికి తీసుకువచ్చే బాధ్యత కూడా తామే చూసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సుర గంగాధర్, ఉప సర్పంచ్ బలేరావు శంకర్, శిబిరం ఇంచార్జ్ లయన్ హనుమంతరావు, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి హైమద్, కోశాధికారి సుంకరి విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చింత ప్రదీప్, వివిధ రంగాల ప్రతినిధులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి

- **ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలి**
- **తహసీల్దార్ నరేష్, ఏపీఎం కిరణ్ కుమార్**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 01(డిడీ9 వార్త):


జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్, అమీర్ నగర్, ఇనయత్ నగర్, కోనాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో తహసీల్దార్ నరేష్, ఐకేపీ ఏపీఎం కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి భాస్కర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు దళారులను ఆశ్రయించకుండా ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని కోరారు. ఏగ్రేడ్ ధాన్యానికి రూ. 2,641, బిగ్రేడ్ ధాన్యానికి రూ. 2,441 లభిస్తుందని, కొనుగోలు కేంద్రాల ద్వారా లభించే ఈ సదుపాయాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు బైకాని జమున మహేష్, అరుణ్ రెడ్డి, నీలిమ దశరథ్, రాములు నాయక్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో దేవి మండప భూమిపూజ

బోధన్, నిజామాబాద్ జిల్లా , అక్టోబర్ 01 (డిడీ9 వార్త):

భీంగల్ పట్టణంలో నవరాత్రి ఉత్సవాల సందడి మొదలైంది. శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు శర్వాణి కమిటీ సభ్యులు సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా దేవి మండప నిర్మాణానికి ప్రత్యేక భూమిపూజతో పాటు సంప్రదాయ కర్ర పూజను వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల సాక్షిగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక నమస్కారాలు అర్పించారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... "అమ్మవారి దయతో నవరాత్రి మహోత్సవాలను సర్వాంగ సుందరంగా, వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాల రోజుల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తాం" అని వెల్లడించారు. భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.



ఈ వేడుకల్లో రఘు పంతులు, శర్వాణి కమిటీ అధ్యక్షుడు గంగాధర్, సభ్యులు బోధిరే నరసయ్య, పురస్తు బద్రి, బోధిరే తిరుపతి, శంకర్, అశోక్, నీలం రమేష్, శ్రీనివాస్, జగన్, గంగాధర్, లింబాద్రి, బొల్లన్న తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి...

- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి కీలక ప్రతిపాదనలు చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ...**
- **ములకలపల్లి–జగన్నాథపురం బ్రిడ్జికి నిధులు.. డైవర్షన్ పనులకు తక్షణ నిధుల అభ్యర్థన...**
- **ములకలపల్లి–మాధారం, ములకలపల్లి–వెంకటాపురం రోడ్ల మంజూరుకు విజ్ఞప్తి...**
- **అశ్వారావుపేట మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు**
- **గుర్రాల చెరువు మీదుగా అచ్యుతాపురం వరకు బైపాస్ రహదారి నిర్మాణానికి ప్రతిపాదన...**

అశ్వారావుపేట:అక్టోబర్ 01 (డిడి 9 వార్త)

అశ్వారావుపేట నియోజకవర్గంలో రహదారులు, వంతెనలు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక రహదారి అభివృద్ధి ప్రతిపాదనలను రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

రాష్ట్ర ప్రభుత్వంలో రోడ్లు-భవనాల శాఖను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. రహదారి మౌలిక వసతుల అభివృద్ధి, రహదారి భద్రత, ప్రాంతీయ అనుసంధానానికి ప్రాధాన్యం ఇస్తూ సమగ్ర రహదారి ప్రణాళికను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ వెల్లడించింది.

ములకలపల్లి–జగన్నాథపురం బ్రిడ్జికి నిధుల అభ్యర్థన

ములకలపల్లి నుంచి జగన్నాథపురం వైపు వెళ్లే మార్గంలో కీలకంగా ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరినట్లు తెలుస్తోంది. ఈ మార్గం ద్వారా పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని స్థానికంగా భావిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, అవసరమైన నిధులు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

డైవర్షన్ పనులకు తక్షణ నిధులు

ములకలపల్లి-జగన్నాథపురం మార్గంలోని బ్రిడ్జి పనులకు సంబంధించి అవసరమైన డైవర్షన్ రోడ్డు/డైవర్షన్ ఏర్పాట్లకు నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని కూడా ఎమ్మెల్యే విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయడం అవసరమని ఆయన సూచించినట్లు తెలిపారు.

ములకలపల్లి–మాధారం రహదారి మంజూరుకు విజ్ఞప్తి

ములకలపల్లి నుంచి మాధారం వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదనను పరిశీలించి మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారి అభివృద్ధి జరిగితే ఆయా గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, మార్కెట్ అవసరాల కోసం ప్రయాణించే ప్రజలకు ప్రయోజనం కలగనుంది.

గ్రామీణ ప్రాంతాలను మండల కేంద్రాలు, ప్రధాన రహదారులతో అనుసంధానించే విధంగా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు సమాచారం.

ములకలపల్లి–వెంకటాపురం రహదారికి మంజూరు

అదేవిధంగా ములకలపల్లి నుంచి వెంకటాపురం వరకు రహదారి నిర్మాణానికి కూడా ప్రతిపాదనను పరిశీలించి నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు.



ఈ రహదారి అభివృద్ధి జరిగితే మారుమూల గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు కూడా అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.

అశ్వారావుపేట మున్సిపాలిటీలో సీసీ రోడ్లు–డ్రైనేజీ

అశ్వారావుపేట పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. మున్సిపాలిటీ పరిధిలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరినట్లు సమాచారం.

వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా రోడ్ల నిర్మాణంతో పాటు శాస్త్రీయ పద్ధతిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

గుర్రాల చెరువు మీదుగా అచ్యుతాపురం వరకు బైపాస్ రహదారి

అశ్వారావుపేట పట్టణానికి సంబంధించి మరో కీలక ప్రతిపాదనగా అశ్వారావుపేట నుంచి గుర్రాల చెరువు మీదుగా అచ్యుతాపురం వరకు బైపాస్ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనను ఎమ్మెల్యే ముందుకు తీసుకెళ్లారు.



ఈ బైపాస్ రహదారి అందుబాటులోకి వస్తే పట్టణంలోని రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పడటంతో పాటు ప్రజల ప్రయాణానికి సౌలభ్యం కలుగుతుందని ప్రతిపాదనలో పేర్కొన్నట్లు సమాచారం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారుల అభివృద్ధి, ప్రత్యామ్నాయ మార్గాలు, గ్రామీణ ప్రాంతాల అనుసంధానంపై సమగ్ర ప్రణాళిక అవసరమని రోడ్లు-భవనాల శాఖ విధాన పత్రం కూడా పేర్కొంటోంది.

నియోజకవర్గ అభివృద్ధికి రహదారులే కీలకం

అశ్వారావుపేట నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో రహదారి అనుసంధానం ప్రజల దైనందిన జీవితంలో కీలకంగా మారింది. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడం, రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడం, అత్యవసర వైద్య సేవల కోసం ఆసుపత్రులకు చేరుకోవడం వంటి అనేక అవసరాలకు రహదారుల నాణ్యతపై ఆధారపడాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి, రహదారి పనులకు నిధులు సమకూర్చడంతో పాటు కొత్తగా అవసరమైన రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.





నిజామాబాద్ లో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

- **నిజామాబాద్ లో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం**
- **నగరంలో అవగాహన ప్రదర్శన ర్యాలీ**
- **జెండా ఊపి ప్రారంభించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నీలిమ**
- **వయోవృద్ధులకు ఘన సన్మానం**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 01(డీడీ9 వార్త):

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం కంఠేశ్వర్ రిలయన్స్ చౌరస్తా నుంచి కేసీఆర్ కాలనీలోని ఎస్.ఎస్. కన్వెన్షన్ హాల్ వరకు వయోవృద్ధుల సంక్షేమంపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శనను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నీలిమ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్.ఎస్. కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వేడుకలను నగర మేయర్ కూరగాయల ఉమా రాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నీలిమ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణ సూచనలు, తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తతపై అధికారులు అవగాహన కల్పించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన సీనియర్ సిటిజన్లను, వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను, వృద్ధాశ్రమ నిర్వాహకులను జిల్లా స్థాయిలో ఘనంగా



సన్మానించారు. అలాగే సెర్ప్ ఆధ్వర్యంలో వివిధ మండలాల నుంచి విచ్చేసిన వృద్ధ మహిళా సంఘ సభ్యులను ముఖ్య అతిథులు ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి డి. సౌందర్య, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ మురళీకృష్ణ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు హేమలత, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నీలిమ, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రసాద్, సైబర్ క్రైమ్ అధికారి శ్రీనివాస్, ఆయుష్ శాఖ అధికారి తిరుపతి, జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ ప్రతినిధులు ఆంజనేయులు, మాయావార్ రాజేశ్వర్, నారాయణ రెడ్డి, ఫయాజుద్దీన్, వాసవి క్లబ్ రవి, గుజ్జ రాజేశ్వరి, పలు సంఘాల ప్రతినిధులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.





ఎస్.ఐ.ఆర్ నోటీసులకు ఆన్‌లైన్‌లో పత్రాలు సమర్పించవచ్చు

- **వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా పంపేందుకు వెసులుబాటు: జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**
- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్ష**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 01(డీడీ9 వార్త):

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు నేరుగా బూత్ స్థాయి అధికారులను కలవలేని పక్షంలో, ఆన్‌లైన్ ద్వారా ఈమెయిల్, వాట్సాప్ సహాయంతో తమ ధ్రువీకరణ పత్రాలను పంపవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. ఓటర్ల జాబితా సవరణ పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి... ఫారం 6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత





గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నవారికి జారీ చేసిన నోటీసులపై విచారణ పారదర్శకంగా జరపాలని, అనర్హులుగా తేలితే స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ... నిజామాబాద్ జిల్లాలో ఇంకా 6,106 మందికి నోటీసులు అందాల్సి ఉందన్నారు. నియోజకవర్గాల వారీగా నిజామాబాద్ అర్బన్‌లో 3,865, ఆర్మూర్‌లో 1,631, బాన్సువాడలో 437, బాల్కొండలో 157, బోధన్‌లో 16 నోటీసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అత్యధిక మంది వలస వెళ్లడం, ఇచ్చిన చిరునామాల్లో అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణమని వివరించారు. క్షేత్రస్థాయిలో బి.ఎల్.ఓలను వారి ఇళ్లకు పంపుతూ నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, విచారణను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఈ.ఆర్.ఓ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ బాలరాజు పాల్గొన్నారు.



పాటలు, నాటకాలతో పోలీసుల వినూత్న ప్రచారం

- **జనవరి నుంచి సెప్టెంబరు వరకు 106 అవగాహన సదస్సులు**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 01(డీడీ9 వార్త):

సమాజంలో నేరాలు జరగకుండా ముందస్తుగా ప్రజల్లో చైతన్యం నింపేందుకు జిల్లా పోలీస్ శాఖ వినూత్న ప్రచార పద్ధతులను చేపడుతోందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని గ్రామాల్లో 'పోలీస్ కళాబృందం' ఆధ్వర్యంలో పాటలు, నాటకాల రూపంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గురువారం తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు జిల్లా వ్యాప్తంగా 106 ప్రచార కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. పల్లెలు, పట్టణాల్లో తిరుగుతూ ప్రజలకు అర్థమయ్యే రీతిలో పలు కీలక అంశాలపై కళాబృందం అవగాహన కల్పిస్తోందని సీపీ వివరించారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు చెప్పడంతో పాటు, మోసపోతే తక్షణమే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే 1908 నంబరుకు తెలియజేయాలని కోరుతున్నారు. నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, ఆపదలో ఉన్న మహిళలు షీ టీమ్స్ నంబరు 8712659795 లేదా 112కు కాల్ చేయాలని స్పష్టం చేస్తున్నారు. హెల్మెట్ ధారణ, అతివేగం మానడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యపరుస్తున్నారు. ఫోన్ పోగొట్టుకుంటే CEIR పోర్టల్ వినియోగం, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, కల్తీ కల్లు నివారణ, చైన్ స్నాచర్ల పట్ల అప్రమత్తతపై ప్రజలను చైతన్యపరుస్తున్నారు. రాత్రింబవళ్లు శ్రమిస్తూ పల్లెల్లో మోసపూరిత దోపిడీల నుంచి ప్రజలను కాపాడుతున్న పోలీస్ కళాబృందం ప్రదర్శనలకు గ్రామీణ ప్రాంతాల్లో విశేష స్పందన లభిస్తోందని సీపీ సాయి చైతన్య అభినందించారు.



లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

- **నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 01(డీడీ9 వార్త):**



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అధ్యక్షతన జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరు, పీసీ పిఎన్డీటీ చట్టం అమలు తీరుతెన్నులపై చర్చించారు. గతంలో నిర్వహించిన తనిఖీల్లో లోపాలు గుర్తించిన స్కానింగ్ సెంటర్లకు నోటీసులు జారీ చేశామని, వారి వివరణల ఆధారంగా భవిష్యత్తులో తీసుకోబోయే చర్యలపై స్పష్టత నిచ్చారు. ప్రతి స్కానింగ్ కేంద్రాన్ని ప్రతి మూడు నెలలకొకసారి అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని, రిజిస్టర్లు మరియు నెలవారీ నివేదికల నమోదును క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.

అర్హత లేని వ్యక్తులతో స్కానింగ్ పరీక్షలు చేయించినా లేదా సోనోగ్రఫీ యంత్రాలను అనర్హులు నిర్వహించినా చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైతే ఆ స్కానింగ్ యంత్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న నిజామాబాద్‌లోని అనుపమ ఆసుపత్రి, బోధన్‌లోని నిఖిల్ స్కానింగ్ సెంటర్, బోధన్ ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించిన స్కానింగ్ సెంటర్ల రెన్యూవల్‌కు కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే జిల్లాలోస్త్రీ, పురుష లింగ నిష్పత్తిని మెరుగుపరిచేందుకు ఎంపిక చేసిన మండలాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల భాగస్వామ్యంతో పీసీ పిఎన్డీటీ చట్టంపై విస్తృత అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజశ్రీతో పాటు గైనకాలజిస్ట్ డా.నికిత, పిల్లల వైద్య నిపుణులు డా. శరత్ చంద్ర, రేడియాలజిస్ట్ డా.నిఖిత, డా. షకీల్, డా. సుప్రియ, డా.కీర్తన, ఎన్జీవో ప్రతినిధి ఉషారాణి, డా. రవీందర్, డా. సికందర్, వేణుగోపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌లో లంక ఘోర పరాజయం..

ఫైనల్లో భారత్‌పాక్ సమరం

- **ఏషియన్ గేమ్స్ సెమీస్‌లో శ్రీలంకపై భారత్ ఘన విజయం**
- **170 పరుగుల లక్ష్య ఛేదనలో 45 పరుగులకే లంక కుప్పకూలింది**
- **భారత బౌలర్ల ధాటికి శ్రీలంక బ్యాటర్లు విలవిల**
- **అజేయంగా 80 రన్స్‌తో జట్టును ఆదుకున్న ఇషాన్ కిషన్**
- **ఫైనల్లో పాకిస్థాన్‌తో స్వర్ణ పతకం కోసం తలపడనున్న భారత్**

డీడీ9 వార్త :

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో శ్రీలంకను 124 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకం పోరుకు సిద్ధమైంది. ఈ విజయంతో ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 21 బంతుల్లో 38 పరుగులతో జట్టుకు మెరుపు ఆరంభం అందించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 46 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 80 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. క్లిష్టమైన పిచ్‌పై కిషన్ ఆడిన ఇన్నింగ్స్ జట్టుకు కొండంత అండగా నిలిచింది. అనంతరం 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, భారత బౌలర్ల ధాటికి విలవిలలాడింది. కేవలం 45 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, అభిషేక్ శర్మ తలా రెండు వికెట్లు పడగొట్టి లంక పతనాన్ని శాసించారు. శనివారం జరగనున్న ఫైనల్లో స్వర్ణ పతకం కోసం భారత్, పాకిస్థాన్‌తో తలపడుతుంది.



కోటగిరిలో ఘనంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

- **దళారులను నమ్మి మోసపోవద్దు: తహసీల్దార్ కాంబ్లే గంగాధర్**

కోటగిరి, అక్టోబర్ 01:(డిడి9 వార్త)

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. మండల కేంద్రంలోని ఐకెపి (ఇందిరా క్రాంతి పథం) కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన "అభినయ 2" వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం నాడు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఘనంగా ప్రారంభించారు. ఐకెపి ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని నిర్వహించనున్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ కాంబ్లే గంగాధర్ రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన పంటను తక్కువ ధరలకు దళారులకు అమ్ముకుని నష్టపోవద్దని హితవు పలికారు. ప్రభుత్వం కల్పించిన ఈ కొనుగోలు కేంద్రాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్దతు ధరల వివరాలు:

రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్తూ మద్దతు ధరల వివరాలను ఆయన వెల్లడించారు.

ఏ గ్రేడ్ (GradeA) రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర నిర్ణయించారు.

బి గ్రేడ్ (GradeB) రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,441 మద్దతు ధర చెల్లించనున్నారు.

వీటితో పాటు, ఈసారి సన్నరకం ధాన్యానికి ప్రత్యేకంగా బోనస్ కూడా ప్రభుత్వం అందిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని శుభ్రపరిచి, నిర్దేశిత తేమ శాతంతో కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్, ఐకెపి ఏపీఎం భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, పీఏసీఎస్ చైర్మన్ కూచి సిద్ధు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణిలతో పాటు స్థానిక రైతులు, ఐకెపి సిబ్బంది తదితరులు ఉన్నారు.






పోతంగల్ ఉమ్మడి మండలాల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

పోతంగల్, అక్టోబర్ 01
డిడి9 వార్త): నిజామాబాద్ జిల్లా

పోతంగల్ ఉమ్మడి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులకు గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ఘన సన్మానం జరిగింది. మాల సంఘాల మరియు బహుజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మల మహానాడు డివిజన్ అధ్యక్షులు మీర్జాపురం సాయన్న మాట్లాడుతూ.. సమాజంలో పత్రికా రంగానిది కీలక పాత్రని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. పోతంగల్ ఉమ్మడి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం మండల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి, బహుజన, బలహీన వర్గాల గళాన్ని వినిపించడానికి నిరంతరం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

అనంతరం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను మాల సంఘాల, బహుజన సంఘాల ప్రతినిధులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గంధపు దత్తు ప్రధాన కార్యదర్శి వడ్ల సురేష్ కార్యదర్శి బ్యాగరి విజయ్ కుమార్, సహాయ కార్యదర్శి యాదురావు, కోశాధికారి సార్గు లక్మన్ కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజ శ్రేయస్సు కోసం, నిష్పక్షపాత వార్తల చేరవేత కోసం తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ప్రెస్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల మహానాడు డివిజన్ అధ్యక్షులు మీర్జాపురం సాయన్న, పోతంగల్ మండల అధ్యక్షుడు జ్యోతి పాల్ కాలే సాయిలు కాశివార్ భీంరావు గైని గంగారం గడ్డం సాయిలు సంఘాల ముఖ్య నాయకులు, దళిత, బహుజన ప్రజాసంఘాల ప్రతినిధులు మరియు స్థానిక విలేకరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మొక్కలు నాటి.. పచ్చదనాన్ని పెంచుదాం మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి

నిజామాబాద్ జిల్లా , అక్టోబర్ 01 (డిడీ9 వార్త):

భీంగల్ పట్టణంలో పచ్చదనం పెంపే ధ్యేయంగా భీంగల్ 5వ వార్డులో వన మహోత్సవం పండుగ వాతావరణంలో జరిగింది. వార్డు ప్రజలకు పలు రకాల పూల మొక్కలను ప్రజాప్రతినిధులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. మొక్కలు నాటడమే కాదు, వాటిని నాటుకున్న బిడ్డల్లా కాపాడుకోవాలి. ఇంటింటికీ మొక్కలు పెంచితేనే మన పట్టణం పచ్చదనంతో శోభిల్లుతుంది అని పిలుపునిచ్చారు. వార్డు నివాసులు ఆనందంగా మొక్కలను స్వీకరించి, వాటిని తమ ఇళ్ల వద్ద నాటి జాగ్రత్తగా పెంచుతామని మాటిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. ఈ భేటీలో కౌన్సిలర్ లావణ్య, మాజీ కోఆప్షన్ సభ్యురాలు గాడి శోభాభూపతిరావు, మున్సిపల్ మేనేజర్, వార్డు అధికారి, ఆర్పీలతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.







జిల్లాల వ్యాప్తంగా క్వాలిటీ స్క్రీనింగ్ జరగాలి

- **-జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ పామూరి**

నిజామాబాద్ జిల్లా , అక్టోబర్ 01 (డిడీ9 వార్త):

జిల్లాలోని ఆర్బీఎస్‌కే మొబైల్ హెల్త్ టీమ్ డాక్టర్లు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఉద్యోగులతో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ పామూరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్బీఎస్‌కే ప్రోగ్రామ్ ద్వారా పిల్లలకు నాణ్యమైన వైద్యాంశాల స్క్రీనింగ్ నిర్వహించాలని సూచించారు. పోషకాహార లోపాలు ఉన్న చిన్నారులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించాలన్నారు. నవజాత శిశువుల నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లల్లో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా తక్షణమే స్పందించి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసేందుకు విద్యాశాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖ, జీజీహెచ్ అధికారులతో త్వరలోనే ప్రత్యేక సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహార నాణ్యతను ఆర్బీఎస్‌కే బృందాలు క్రమం తప్పకుండా పరిశీలించాలని, ఏవైనా లోపాలు ఉంటే నివేదించాలని స్పష్టం చేశారు. విధుల పట్ల ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ, జిల్లా స్త్రీశిశు సంక్షేమ అధికారి సౌందర్య, ఆర్బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అశోక్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ నవ్య, మేనేజర్ సచిన్, ఆర్బీఎస్‌కే వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో వైభవంగా బొడ్డెమ్మ..

- **ఆటపాటలతో సందడిగా ఆడబిడ్డల సంబరాలు**
- **గ్రామ గ్రామాన రకరకాల పూలతో బొడ్డెమ్మల ఏర్పాటు**
- **గద్దె చుట్టూ తిరుగుతూ పాటలు పాడిన మహిళలు,చిన్నారులు**

ఏటూరునాగారం క్రైం,
డి డి 9 వార్త, అక్టోబర్ 01:

ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో బొడ్డెమ్మ వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఆడపడుచులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా బొడ్డెమ్మ పాటలు, చప్పట్లు, మహిళల కోలాహలంతో పండుగ వాతావరణం నెలకొంది.బొడ్డెమ్మ.. బొడ్డెమ్మ ఉయ్యాలో..బిడ్డలెందరమ్మ ఉయ్యాలో.. అంటూ పాటలు పాడుతూ గద్దె చుట్టూ తిరుగుతూ మహిళలు,పిల్లలు అలరించారు. గద్దెపై పసుపు,కుంకుమ,పూలతో గౌరమ్మను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.గ్రామంలో పూసిన రకరకాల పూలను సేకరించి బొడ్డెమ్మను అందంగా పేర్చి వేడుకలు నిర్వహించారు.ఏజెన్సీ ప్రాంతంలోని నార్లాపురం,బీరెల్లి,కాటాపురం తదితర గ్రామాల్లో సాయంత్రం వేళ బొడ్డెమ్మ ఆటలు ప్రారంభమై రాత్రి వరకు కొనసాగాయి.కొన్ని గ్రామాల్లో సాయంత్రం 6 గంటలకు, మరికొన్ని గ్రామాల్లో రాత్రి 7 గంటలకు వేడుకలు ప్రారంభించి రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు కొనసాగించారు. తొలిరోజే మహిళలు,ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. బొడ్డెమ్మను సంప్రదాయబద్ధంగా పందిరి బొడ్డెమ్మ, గుంట బొడ్డెమ్మ, గద్దె బొడ్డెమ్మ తదితర రకాలుగా ఏర్పాటు చేసి మహిళలు ఆటపాటలతో వేడుకలు నిర్వహిస్తారు.ఉత్సవాల చివరి రోజున బొడ్డెమ్మను నీటిలో నిమజ్జనం చేసి సంప్రదాయాన్ని కొనసాగిస్తారు.

కాటాపురం రామాలయం
వద్ద బొడ్డెమ్మ సందడి....

కాటాపురం గ్రామంలోని రామాలయం వద్ద బొడ్డెమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి.మహిళలు పుట్టమట్టిని తీసుకువచ్చి గద్దెను ఏర్పాటు చేసి,చుట్టూ పసుపు,కుంకుమ,పూలతో అలంకరించారు. రామాలయ వీధి,పెరకవాడ, బొడ్రాయిగుంపు,దొడ్డొళ్లవాడ, దొరొళ్లవాడకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆటపాటలతో బొడ్డెమ్మను కొలుస్తూ రాత్రి 9.45 గంటల వరకు మహిళలు సందడి చేశారు.బొడ్డెమ్మ పాటలు,చప్పట్లతో రామాలయ వీధి అంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. తొలిరోజే పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడంతో కాటాపురం గ్రామంలో బొడ్డెమ్మ వేడుకలు కన్నులపండువగా సాగాయి.





టీమిండియాకు ఎదురుదెబ్బ.. మూడో వన్డేకు ప్రసిద్ధ్ కృష్ణ దూరం.. యువ పేసర్ కు చాన్స్!

- **వెస్టిండీస్‌తో రెండో వన్డేలో తొడ కండరాల గాయంతో మైదానం వీడిన ప్రసిద్ధ్**
- **అతని స్థానంలో యువ పేసర్ అన్షుల్ కంబోజ్‌కు జట్టులో చోటు**
- **పరీక్షల కోసం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్‌కు వెళ్లనున్న ప్రసిద్ధ్**
- **న్యూజిలాండ్ పర్యటనకు ప్రసిద్ధ్ లభ్యతపై నెలకొన్న ఆందోళన**

డీడీ9 వార్త :

వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో ఉన్న భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. కీలక పేస్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ తొడ కండరాల గాయం (హ్యామ్‌స్ట్రింగ్) కారణంగా మూడో వన్డేకు దూరమయ్యాడు. అతని స్థానంలో యువ పేసర్ అన్షుల్ కంబోజ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది.

గువహటి వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డేలో ఈ ఘటన చోటుచేసుకుంది. బౌలింగ్ చేస్తున్న సమయంలో ప్రసిద్ధ్ కృష్ణ అసౌకర్యంగా కనిపించాడు. తన తొలి స్పెల్‌లో నాలుగు ఓవర్లు వేసిన అతను, 31వ ఓవర్ వేసిన తర్వాత మైదానం వీడాడు. మొత్తం మీద కేవలం ఐదు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయడంతో, అతని స్థానంలో జట్టు యాజమాన్యం పార్ట్ టైమ్ బౌలర్ నమన్ ధిర్‌తో బౌలింగ్ చేయించాల్సి వచ్చింది.

గాయం తీవ్రతను అంచనా వేసేందుకు ప్రసిద్ధ్ కృష్ణను బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పంపనున్నారు. అక్కడ జరిపే స్కాన్‌ల ఆధారంగా అతను కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందనే దానిపై స్పష్టత రానుంది. "ప్రసిద్ధ్ మూడో వన్డే ఆడటం లేదు. తదుపరి పరీక్షల కోసం అతను బెంగళూరు వెళతాడు. ప్రస్తుతానికి అతని స్థానంలో కంబోజ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది" అని బీసీసీఐ వర్గాలు గురువారం ఓ వార్తా సంస్థకు తెలిపాయి.

అన్షుల్ కంబోజ్‌ను, ప్రస్తుతం పుదుచ్చేరిలో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో జరుగుతున్న మ్యాచ్ నుంచి బీసీసీఐ వెనక్కి పిలిపించింది. ఆ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు తీసిన కంబోజ్, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం రెండు ఓవర్లు వేసిన అనంతరం, అతడికి తాజా సమాచారం అందించారు. దాంతో అతడు భారత జట్టుతో చేరేందుకు బయలుదేరాడు.



ప్రసిద్ధ్ గాయం కేవలం ఈ సిరీస్‌కే కాకుండా, త్వరలో జరగనున్న న్యూజిలాండ్ పర్యటనపైనా ఆందోళన కలిగిస్తోంది. ఆ పర్యటనలో ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఉన్న నేపథ్యంలో ప్రసిద్ధ్ వంటి కీలక బౌలర్ లభ్యత జట్టుకు చాలా ముఖ్యం. మూడో వన్డేలో ప్రసిద్ధ్ లేకపోవడంతో, ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లలో బెంచ్‌కే పరిమితమైన సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు లేదా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది.

వన్డే క్రికెట్‌లో కొత్త చరిత్ర.. ప్రపంచ రికార్డు బద్దలుకొట్టిన టీమిండియా!

- **వెస్టిండీస్‌తో రెండో వన్డేలో భారత్‌కు చారిత్రక విజయం**
- **వన్డేల్లో టీమిండియాకు ఇదే అత్యధిక స్కోరు ఛేజింగ్**
- **కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అజేయ డబుల్ సెంచరీ**
- **అతివేగంగా 300 పరుగులు చేసిన జట్టుగా ప్రపంచ రికార్డు**
- **దక్షిణాఫ్రికా 18 ఏళ్ల రికార్డును బద్దలుకొట్టిన భారత్**

డీడీ9 వార్త :

శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా వన్డే క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. వెస్టిండీస్‌తో గువాహటి వేదికగా నిన్న జరిగిన రెండో వన్డేలో 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి అద్భుత విజయాన్ని అందుకుంది. వన్డే ఫార్మాట్‌లో భారత్‌కు ఇదే అతిపెద్ద విజయవంతమైన ఛేజింగ్ కావడం విశేషం.

ఈ భారీ ఛేదనలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ముందుండి నడిపించాడు. కేవలం 133 బంతుల్లోనే అజేయంగా 223 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. గిల్ వీరోచిత ఇన్నింగ్స్‌తో టీమిండియా 43.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తి చేసింది.

భారత్ మరో ప్రపంచ రికార్డు

ఈ మ్యాచ్‌లో భారత్ మరో ప్రపంచ రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. వన్డేల్లో అత్యంత వేగంగా 300 పరుగుల మార్కును అందుకున్న జట్టుగా నిలిచింది. కేవలం 175 బంతుల్లోనే (30 ఓవర్లలోపు) టీమిండియా ఈ ఘనతను సాధించింది. ఇంతకుముందు ఈ రికార్డు దక్షిణాఫ్రికా పేరిట ఉండేది. 2006లో జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియాపై ఆ జట్టు 194 బంతుల్లో 300 పరుగులు చేసింది. తాజాగా ఆ రికార్డును భారత జట్టు బద్దలుకొట్టింది.

ఆదర్శ కుటుంబం.. అలాంటి అనుమానాలేవీ వద్దు

'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47'.. అంటూ కుటుంబ కథాచిత్రంతో ప్రేక్షకులను పలకరించనున్నారు అగ్రకథానాయకుడు వెంకటేశ్ (Venkatesh). త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అక్టోబరు 9న (adarsha kutumbam release date) ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా అనుకున్న సమయానికి వస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతోన్న వేళ.. నిర్మాత నాగవంశీ స్పందించారు. విడుదల తేదీ విషయంలో ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. ప్రణాళిక ప్రకారమే రిలీజ్ అవుతుందని స్పష్టం చేశారు.

"మా బ్యానర్ మీద మీకు అనుమానం ఉండొచ్చు.. కానీ, ఈసారి ఎలాంటి డౌట్ వద్దు. ఆదర్శ కుటుంబం విడుదల తేదీ అక్టోబర్ 9లో ఎలాంటి మార్పు ఉండదు (Aadarsha Kutumbam house no 47). 6వ తేదీ ట్రైలర్ లాంచ్ ఉంటుంది. మరుసటి రోజు నుంచే రెండు తెలుగు రాష్ట్రాల్లో టికెట్స్ బుకింగ్స్ ఓపెన్ అవుతాయి. ఈ దసరాను మా సినిమాతో ప్రారంభించండి" అని నాగవంశీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ప్రీమియర్స్ ఉండవని వెల్లడించారు. వెంకటేశ్‌కు జోడీగా శ్రీనిధిశెట్టి నటించిన ఈ సినిమాలో నారా రోహిత్ కీలకపాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రంలో 'నారాయణమ్మ' పాటను విడుదల చేయగా అది సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.



'సిగ్మా'పై నెగెటివ్ ప్రచారం.. దీని వెనుక ఎవరున్నారో తెలుసు



న సినిమాపై నెగెటివ్ ప్రచారం చేస్తున్న వారిపై మండిపడ్డారు కథానాయకుడు సందీప్ కిషన్. (Sundeep Kishan) ఇది ఇలాగే కొనసాగితే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. సందీప్ కీలక పాత్రలో తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతూ తీర్చిదిద్దిన చిత్రం 'సిగ్మా'. ఫరియా అబ్దుల్లా కథానాయిక. రాజు సుందరం, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.తమిళ, తెలుగు భాషల్లో అక్టోబరు 2న (sigma movie release date) విడుదల కానుంది. ఈ క్రమంలో సామాజిక మాధ్యమాల వేదికగా 'సిగ్మా'పై నెగెటివ్ ప్రచార చేయడంపై అసహనం వ్యక్తం చేశారు.

సాహసాలతో కూడిన కథగా, నిధి అన్వేషణ తరహాలో 'సిగ్మా'ను (sundeep kishan new movie) తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్, ఎన్. వి.ఆర్ సినిమా సంస్థలు విడుదల

శ్రీకాంత్ ఓదెల నన్ను మోసం చేశాడు



టాలీవుడ్ సీనియర్ నటుడు, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు (Mohan Babu), దర్శకుడు శ్రీకాంత్ ఓదెల (Srikanth Odela)పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపుదిద్దుకుని మిక్డ్స్ టాక్‌తో రన్ అవుతోన్న 'ప్యారడైజ్' మూవీకి సంబంధించి ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, దర్శకుడు తనను మోసం చేశాడని కామెంట్ చేశారు.

హీరోయిన్ జోడీ అని చెప్పి హ్యాండిచ్చారు..

'ప్యారడైజ్' సినిమాలో తన పాత్ర రూపకల్పన గురించి మోహన్ బాబు ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమా ప్రారంభంలో కథ చర్చల సమయంలో తనకు జోడీగా ఓ హీరోయిన్ పాత్ర ఉంటుందని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల చెప్పారని ఆయన గుర్తుచేసుకున్నారు. అయితే, తీరా షూటింగ్ ప్రారంభమైన తర్వాత ఆ పాత్ర అసలు లేనే లేదని దర్శకుడు చెప్పడంతో ఆశ్చర్యపోయానని అన్నారు. 'ముందుగా నాకు జోడీగా హీరోయిన్ ఉంటుందని చెప్పి, ఆ తర్వాత షూటింగ్‌లో ఆ పాత్ర లేదని చెప్పడం మోసం కాదా?' అంటూ సరదాగా మోహన్ బాబు గుర్తుచేసుకున్నారు.

సుధీర్ GOAT రిలీజ్ డేట్ ఫిక్స్..



జబర్దస్త్ ఫేమ్ సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం G.O.A.T (గోట్). GreatestOfAllTimes అనే ట్యాగ్ లైన్‌తో వస్తోన్న ఈ మూవీలో దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తుంది. వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను తాజాగా ప్రకటించారు మేకర్స్. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ సమర్పణలో ఈ చిత్రం నవంబరు 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు ప్రకటిస్తూ.. 'వినోదం, భావోద్వేగాలు అండ్ పిచ్చి చేష్టలతో నిండిన ఉత్కంఠభరితమైన వెండితెర అనుభవానికి సిద్ధంగా ఉండండి.. థియేటర్లలో కలుద్దాం' అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. ఇదిలా ఉంటే.. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రతి కంటెంట్‌కు మంచి స్పందన రాగా.. త్వరలోనే చిత్ర ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా.. నిర్మాత మాట్లాడుతూ 'ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో ఉంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పుకొచ్చారు.

'గుడియా బిందాసు బిందాసు వాలి.. దిల్‌పై పట్టాసు జుక్కాస్ లేడీ... ఇదిగో అనార్కళీ రా..' అంటూ ఆడిపాడి అలరించారు అందాల తార నోరా ఫతేహి. రజనీకాంత్ ప్రధాన పాత్రలో 'జైలర్ 2' సినిమా ఈ నెల 15న రాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'బిందాస్..' అనే ప్రత్యేక గీతాన్ని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. 'దునియా మోనోపోలీరా.. ఇక అతని చుట్టూరా.. మీ ఎత్తులు అన్నీ చిత్తేరా..' అంటూ సాగుతున్న ఈ పాటలో కుర్రకారుని ఆకట్టుకునేలా హుషారైన స్టెప్పులతో అలరించారు నోరా. ఈ గీతానికి అనిరుధ్ స్వరాలు సమకూర్చి.. దీప్తి సురేశ్‌తో కలిసి ఆలపించారు. శ్రీనివాస మౌళి సాహిత్యమందించారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సన్‌పిక్చర్స్ నిర్మించింది.

నోరా.... బిందాస్



కరెన్సీ కాదు కంటెంట్ ముఖ్యం.. బ్లాక్ బస్టర్ హిట్ 'హనుమాన్ అంశ్' సీక్వెల్‌పై నిర్మాత అప్డేట్



నీమ్ కరోలీ బాబా జీవిత చరిత్ర ఆధారంగా విశాల్ చతుర్వేది తెరకెక్కించిన చిత్రం 'హనుమాన్ అంశ్'. ఈ ఏడాది ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఘన విజయం సాధించి మునుపెన్నడూ లేని విధంగా బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించింది. తర్వాత తెలుగులో కూడా డబ్ చేయబడి ఇక్కడ మంచి ఆధారణ పొందింది. కేవలం రూ. 1.5 కోట్లతో తెరకెక్కిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 312 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అలాంటి ఈ మూవీ సీక్వెల్‌పై అప్డేట్ ఇచ్చింది నిర్మాత అనుప్రియా నాగర్. ఈ మూవీ విజయం అనంతం మీడియాతో మాట్లాడిన ఆమె.. 'మొదటి భాగం భారీ వసూళ్లు సాధించినంత మాత్రాన రెండో భాగాన్ని భారీ బడ్జెట్‌తో రూపొందించాలని అనుకోవడం లేదు. కథ డిమాండ్‌ను బట్టి భారీ స్థాయి అవసరమైతే తప్ప సీక్వెల్‌ను కూడా మొదటి భాగానికి పెట్టిన బడ్జెట్‌లోనే తీయాలని భావిస్తున్నా. ఎందుకంటే రూ. 10 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు పెట్టినంత మాత్రాన బాగా వస్తుందని చెప్పలేం. అవసరం లేకపోయినా అనవసరంగా VFX, AIని వినియోగిస్తే సినిమా సహజత్వం దెబ్బతినే అవకాశం ఉంటుంది. కాబట్టి కరెన్సీ కంటే కంటెంట్ ముఖ్యం. బడ్జెట్ పెంచడం కంటే వాస్తవికతను కాపాడుకోవడమే ముఖ్యం. సినిమాకు సంబంధించి పాత్రలే కాదు, కథకు సంబంధించిన కాలం నాటి భౌగోళిక పరిస్థితులు, వాతావరణం చూపించడం ముఖ్యం. అందుకే వాస్తవికతకే ప్రాధాన్యం ఇస్తాం' అని చెప్పుకొచ్చారు. మొదటి భాగానికి ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనను దృష్టిలో పెట్టుకుని తగిన జాగ్రత్తలు తీసుకుని రెండో భాగాన్ని తెరకెక్కిస్తాము అని చేసిన నిర్మాత కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. అలాగే 'హనుమాన్ అంశ్' డైరెక్టర్ ప్రస్తుతం వేరే సినిమా ఒప్పుకోవడంతో ఈ సినిమా సీక్వెల్‌కు కాస్త సమయం పడుతుందని చెప్పుకొచ్చారు.

స్టార్‌డమ్ చూసి నటులను చెయ్యను..



దర్శక ధీరుడు రాజమౌళి ప్రస్తుతం 'వారణాసి' చిత్రంతో బిజీగా ఉన్నాడు. సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ మూవీని రాజమౌళి ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా.. ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకులకు ఈ మూవీని చేరువ చేస్తున్నాడు. ఇందులో భాగంగానే తాజాగా పెన్ స్టేట్ ఫిల్మ్‌మేకింగ్ విద్యార్థులతో సంభాషణలో పాల్గొన్న రాజమౌళి.. నటుల సెలక్షన్‌పై చేసిన కామెంట్స్ ప్రజెంట్ వైరల్ అవుతున్నాయి. 'ఒక నటుడిని కేవలం అతను సూపర్‌స్టార్ అనే కారణంతో నేనెప్పుడూ ఎంపిక చేసుకోను. ఆ పాత్రకు నిజంగా సరిపోయే నటుడినే ఎంచుకుంటాను. ఒకసారి నటుడిని ఎంపిక చేసుకున్న తర్వాత, అతను నాపై నమ్మకం ఉంచాలని నేను ఆశిస్తాను. ఆ పాత్రకు అవసరమైన నటనను అతని నుంచి రాబట్టేందుకు నేను మార్గనిర్దేశం చేస్తాను' అని తెలిపారు. అలాగే మహేశ్ బాబు గురించి మాట్లాడుతూ.. 'మహేష్ బాబు ఒక భారీ సూపర్‌స్టార్. వారణాసి కోసం నేను ఆయన నుంచి 100 శాతం పనితీరును ఆశించా. అయితే ఆయనతో కలిసి పనిచేయడం ప్రారంభించిన తర్వాత, ఆయన నా అంచనాలను పూర్తిగా మించిపోయారు. నేను ఊహించిన ప్రతిదానినీ దాటి వెళ్లి, 200 శాతం ఇచ్చారు. ఆయన ఆ పాత్రను అద్భుతంగా పండించారు. పాత్రలోకి మహేశ్ తీసుకొచ్చిన కొత్త కోణాలు నన్ను ఆశ్చర్యపరిచాయి. నేను ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువ చేశారు. అందుకే వారణాసిలో మహేష్ బాబుతో కలిసి పనిచేయడం నాకు ఎంతో ప్రత్యేకమైన అనుభవంగా మారింది' అంటూ ఆయన అనుభవాన్ని పంచుకున్నారు రాజమౌళి.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.